క్లుప్తంగా

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధన


అలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోనున్న మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంత్రాలయంలో 354వ ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు పద్మనాభాచార్ తెలిపారు. పూర్వారాధన కార్యక్రమంలో భాగంగా స్వామికి విశేష పంచామృతాభిషేకం, కనక మహాపూజ, పల్లకీ సేవ, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్య ఆరాధనలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు, ఉత్తర ఆరాధనలో భాగంగా మంగళవారం కనక మహాపూజ రథోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

ఏపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



బత్తలపల్లి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం ఒంగోలు పట్టణంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కార్యవర్గ సభ్యులు ఎంపిక చేసినట్లు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. రాజేంద్రప్రసాద్‌కు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు అమర చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా తిరంగా యాత్ర


తిరంగా యాత్రలో పాల్గొన్న నాయకులు


ఓడీచెరువు: మండల కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ బీజేపీ మండలాధ్యక్షుడు వీరాంజినేయులు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేయాలని కోరారు. కార్యక్రమంలో తిరంగా యాత్ర మండల ఇన్‌చార్జ్ భాస్కర్ నాయక్, నరేష్, సీనియర్ నాయకులు కిష్టప్ప, రంగారెడ్డి, అశ్వత్థప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

అంత్యక్రియలకు ఆర్థికసాయం


ముత్యాలమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ వెంకటేష్

ధర్మవరం రూరల్: పట్టణంలోని 25వ వార్డు లక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన పూలచెట్లు ఆనంద్ భార్య ముత్యాలమ్మ ఆదివారం కాన్పు కోసం ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. అక్కడ పండంటి బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ మృతురాలి ఇంటికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: మామిళ్లకుంట క్రాస్ ఎస్సీకాలనీ వాసులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్ వెంకటేష్, రమాదేవి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వారు ఎస్సీకాలనీలో పర్యటించగా స్థానికులు వారి సమస్యలను తెలియజేశారు. శనివారం మామిళ్లకుంట క్రాస్‌కు చెందిన చెన్నమ్మ అనే మహిళ చనిపోతే శ్మశానవాటికి స్థలం లేక వంక పోరంబోకు స్థలంలో పూడ్చామన్నారు. అయితే భారీ వర్షాలకు మృతదేహం కొట్టుకుపోతుందోమోనని రాత్రంతా కాపలాకాసినట్లు తెలిపారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని తాము పలుమార్లు తహసీల్దార్‌కు చెప్పినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మామిళ్లకుంట క్రాస్‌లో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు.

చెరువులకు నీరు చేరేదెలా?


గంటల మారెమ్మ కనుమ వద్ద పర్లాంగు మేర నిలిచిన వర్షం నీరు


బత్తలపల్లి కాలువకు అడ్డుగా మట్టిరోడ్డు వేయడంతో నిలిచిన నీరు

- రోడ్డు పనులతో వంకలకు అడ్డుగా మట్టి దిబ్బలు
- వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకులు

పుట్టపర్తి అర్బన్: భారీ వర్షాలు కురిసి వర్షపునీరు ఉప్పొంగుతుంటే సంతోషపడాలో ఆ నీరు చెరువులకు చేరడం లేదని బాధపడాలో అర్థం కాని స్థితిలోని ఉన్నారు మండలంలోని రైతులు. ఇటీవల మండలవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. అయితే మండలంలో చేపట్టిన 342 జాతీయ రహదారి పనులతో వంకలకు అడ్డుగా మట్టి వేయడంతో చెరువులకు నీరు చేరడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రెండేళ్ల నుంచి 342 జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కొన్ని చోట్ల మట్టి దిబ్బలు ఎక్కడికక్కడ ఉండడంతో వర్షపునీరు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా బత్తలపల్లి, గువ్వలగుట్టపల్లి, వెంకటగారిపల్లి, జగరాజుపల్లి చెరువులకు నీరు చేరకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రధాన కాలువకు అడ్డుగా మట్టిరోడ్డు..

బత్తలపల్లి చెరువుకు వెళ్లే ప్రధాన కాలువకు అడ్డుగా మట్టిరోడ్డు వేయడంతో నీళ్లు నిలిచి పోయి పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్తున్నాయి. దీంతో రైతులతో పాటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక గంటల మారెమ్మ కనుమ వద్ద నిర్మిస్తున్న టోల్ గేట్ పనులతో భారీగా మట్టి దిబ్బలు, పెద్ద పెద్ద బండరాళ్లను పక్కనున్న వంకలోకి తోలారు. దీంతో కొండలు, గుట్టల నుంచి వచ్చే వర్షపు నీళ్లు మారెమ్మ ఆలయం కింది భాగంలో నిలిచి పోయాయి. సుమారు పర్లాంగు మేర నీళ్లు నిలువ ఉన్నాయి. ఇక వెంకటగారిపల్లి చెక్‌డ్యాంకులకు నీరు వెల్లకుండా మట్టి దిబ్బలు అడ్డుగా ఉన్నాయి. ఇలా ఎక్కడికక్కడ నీళ్లు నిలిచి పోవడంతో ఇంకెప్పుడు చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తాయని ఎదురు చూస్తున్నారు. కొన్ని చోట్ల రైతులు చెరువు కింద వరి సాగు చేశారు. నీరు చెరువులకుపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ రాజును వివరణ కోరగా 342 జాతీయ రహదారి పనులు చేస్తున్న కంట్రాక్టర్లతో విషయం చెప్పామని, త్వరలోనే మట్టి దిబ్బలను తొలగింపజేసి చెరువులకు నీళ్లు వెళ్లేలా చూస్తామని తెలియజేశారు. తనకు ఇప్పటికే పలువురు రైతులు సమాచారం ఇచ్చారని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు.

ధర్మవరంలో కుండపోత వర్షం


ధర్మవరంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

ధర్మవరం అర్బన్: పట్టణంలో శనివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. మగ్గం గుంతల్లో నీరు చేరి రేషం తడిసిపోయింది. ఎన్టీఆర్ సర్కిల్ వద్దనున్న ప్రధాన రహదారి మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుంది. దుకాణాల్లోకి నీరు చేరడంతో వ్యాపారస్తులు ఇక్కట్లు పడ్డారు. ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలవడంతో వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

బత్తలపల్లిలో 36.2 ఎంఎం వర్షపాతం

బత్తలపల్లి: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 36.2 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు చిత్రావతి నది కొద్దిగా ప్రవహిస్తోంది. చిన్నపాటి వాగులు సైతం సాగుతున్నాయి. దీంతో ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేసే రైతులు కొద్ది మేరకు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ఉచిత యోగా శిక్షణ

హిందూపురం టౌన్: పట్టణంలోని మేళాపురంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వివేకానంద యోగా థెరపీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 30 రోజులు ఉచిత యోగ శిక్షణ తరగతులు ముగిశాయి. ఆదివారం ముగింపు కార్యక్రమంలో యోగా టీచర్ బద్రీనారాయణ మాట్లాడుతూ యోగాసనాలతో ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం యోగా శిక్షకులను సన్మానించారు. కార్యక్రమంలో కరే రమేష్, వెంకటేష్ బాబు, దేవాంగం శంకరప్ప, మహేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ గుడిలో చోరీ

తనకల్లు: మండలంలోని ఒడ్డు మరవపల్లిలో ఉన్న మారెమ్మ గుడిలో ఆదివారం చోరి జరిగింది. మారెమ్మ ఆలయం తలుపులను పగులగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించి గర్భగుడిలో ఉన్న హుండీని ధ్వంసం చేశారు. హుండీలోని దాదాపు రూ. 10 వేలు నగదును దొంగలు దోచుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఘటపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మట్టి ఖర్చులు ఇవ్వలేరా?


శ్రీనివాసులు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఆప్కాస్ పారిశుధ్య కార్మికుడు 3వ డివిజన్‌కు చెందిన శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, జగదీష్... శ్రీనివాసులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా మున్సిపాలిటీకి శ్రీనివాసులు ఎంతో సేవ చేశారన్నారు. అయితే చనిపోయిన కార్మిక కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందించకపోవడం విచారమన్నారు. మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో హిందూపురం మున్సిపాలిటీ ఉండడం దురదృష్టకరమన్నారు.

పోలీసుల అదుపులో దొంగ?

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడతున్న దొంగను కియా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మండలంలోని మునిమడుగుకు చెందిన వ్యక్తి కొద్దిరోజులుగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలు సమీప గ్రామాల్లో తక్కవ ధరలకే విక్రయిస్తున్నట్లు సమాచారం. పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని కొన్ని ద్విచక్ర వాహనాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు దగా


కార్యక్రమంలో పాల్గొన్న కన్వీనర్ లక్ష్మిరెడ్డి తదితరులు

ఓడీచెరువు: సూపర్‌సిక్స్ పథకాల పేరుతో సీఎం చంద్రబాబు ప్రజలను దగా చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి విమర్శించారు. తంగేడుకుంట గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మిరెడ్డి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ఏడాది దాటినా ఎన్నికల హామీలు అమలు చేయడం లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలైన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్ పథకాలను అటకెక్కించారని ధ్వజమెత్తారు. అడపాదడపా పథకాలు అమలు చేసినా వాటిలో చాలామందికి మొండిచేయి చూపారని విమర్శించారు. కార్యక్రమంలో తంగేడుకుంట సర్పంచ్ భర్త రఫీ, ఎంపీటీసీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టివారి రమేష్, చింతా వెంకటేశ్, నరసింహరెడ్డి, అశ్వర్థరెడ్డి, గువ్వ రాము, కృష్ణారెడ్డి, హోటల్ బాబు, కిష్టప్ప, వెంకటరమణ, వీరప్ప, మూర్తి, నాగరాజు, ఆదినారాయణమ్మ, అలివేలు, గంగయ్య, యశోదమ్మ, గంగాద్రి, ఈశ్వర్, సూర్యం, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

ఎన్‌పీకుంట: మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, రెవెన్యూ అధికారులు వాటిని పరిరక్షించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో చెరువు, వంకపోరంబోకు, గ్రామ కంఠం భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. మండల కేంద్రానికి సమీపంలోని వంకమద్దిక్రాస్ వద్దనున్న ప్రభుత్వ భూమిలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని గతంలో సీపీఐ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు సమర్పించామని, దానికి అధికారులు కూడా సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. కానీ ఈ మధ్య కాలంలో కొంత మంది కబ్జాదారులు ఆ ప్రభుత్వ భూమిపై కన్నేసి వాటిని ఆక్రమించుకొని అమ్ముకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ప్రభుత్వ భూములను గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డుపై నీరు.. పట్టించుకోండి సారూ!

ఓడీచెరువు: కూటమి ప్రభుత్వం గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు గుప్పించడమే తప్ప వాటి గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందుకు మలకవారిపల్లి ఎస్సీ కాలనీలోని రోడ్లే నిదర్శనంగా చెబుతున్నారు. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు మొత్తం రోడ్డుపై చేరింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.


ఎస్సీకాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

అపూర్వ సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పరిగి: మండల కేంద్రమైన పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలియతిరిగి జ్ఞాపనాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయం



ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, కదిరిలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే యూటీఎఫ్ ధ్యేయమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఫెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ గత 51 ఏళ్లుగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా యూటీఎఫ్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రయోగశాలగా చూడకూడదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలు మార్చకూడదని సూచించారు. సమాజానికి ఉపయోగపడే విద్యా విధానాలను రూపొందించాలని చెప్పారు. ప్రపంచమంతా శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో భారతీయ విద్య కూడా పురోభివృద్ధి చెందాలన్నారు. మూఢనమ్మకాలను కులతత్వాన్ని ప్రాంతీయతత్వాన్ని మతతత్వాన్ని విడనాడే దిశగా విద్యాసంస్కరణలు ఉండాలన్నారు. యూటీఎఫ్ నాయకులు హనుమంతరావు, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, హెచ్.రామాంజనేయులు, సకల చంద్రశేఖర్, ఆంజనేయులు, సురేష్, అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణతేజ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కదిరి అర్బన్: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆదివారం యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఫెడరేషన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ జిల్లా కోశాధికారి, కార్యదర్శులు శ్రీనివాసులు, తాహెర్‌వలీ, సుబ్బారెడ్డి, గౌస్‌ఖాన్ హాజరయ్యారు. తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు విద్యారంగ పరిరక్షణకు ఫెడరేషన్ చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచిత విద్యను దూరం చేస్తోందన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడిచేలా పాలకులు, అధికారులు దారులు తెరుస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు


తాడిమర్రిలో పాదయాత్రగా వెళుతున్న భజన బృందం

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భజన బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెందిన కొందరు భక్తులు శ్రీరాముని చిత్రపటం పట్టుకుని శనివారం పాదయాత్ర చేసుకుంటూ శనివారం సాయంత్రం క్షేత్రానికి వచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం రాత్రి ఆలయంలోనే నిద్ర చేశారు. ఆదివారం ఉదయం ఆలయంలో మరో మారు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి వారు భజనలు చేసుకుంటూ పాదయాత్రతో వారి స్వగ్రామం చేరుకున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని కోరారు

రేపు జాబ్‌మేళా

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ ఆదివారం తెలిపారు. మేళాలో 12 బహుళ జాతీ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులు, టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్ చదివిన మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేలకు జీతభత్యాలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు జాబ్ కోర్డినేటర్ అంజనేయులు(7981541994)ను సంప్రదించాలని సూచించారు.

కంటి వైద్య శిబిరం


దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 135మందికి కంటి పరీక్షలు చేయగా 105 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని వారికి బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారని రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి నరేంద్రరెడ్డి తెలిపారు. దాసరి కేశమ్మ, దాసరి పెద్ద వెంకటేషులు జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు దాసరి వెంకటేషులు, రమాదేవి దాతలుగా వ్యవహరిచడంతో వారిని ఘనంగా సన్మానించారు. క్యాంపు చైర్మన్‌గా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ వవ్యహరించారు. రోటరీక్లబ్ సభ్యులు సత్రశాల ప్రసన్నకుమార్, సుదర్శన్‌గుప్త, రత్నశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, రామకృష్ణ, కొండయ్య, కృష్ణమూర్తి, జయసింహ, బండారు వెంకటచలం, హరినాథ్, డాక్టర్ నరసింహులు, శంకర్ కంటి ఆసుపత్రి మేనేజర్ శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పాడి ఆవు మృతి


మృతి చెందిన పాడి ఆవు

మడకశిర: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన సిద్ధమ్మ అనే మహిళకు చెందిన పాడి ఆవు ఆదివారం మృతి చెందింది. చెత్త దిబ్బల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు తినడంతో పాడి ఆవు మృతి చెందినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. పాడి ఆవు మృతితో రూ.50 వేలు నష్టపోయినట్లు వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించింది.